## మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన విజయోత్సవాల సంరంభం

**హైదరాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శించింది. 'జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ హైదరాబాద్ మెట్రో రైల్ మొత్తం 25 మెట్రోస్టేషన్లలో కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి చిత్రాలను ఏర్పాటుచేసినట్టు హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను




హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియబరిచేలా స్టేషన్ల కాన్ కోర్స్‌లు, ప్లాట్ ఫామ్‌లపైన స్టాండీలను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాలలో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్ లను ఏర్పాటు చేసి ఈ సంవత్సరం ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని ఎన్వీఎస్ వెల్లడించారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. సంవత్సర పాలన విజయాలను ఘనంగా ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొంటోంది.


హైదరాబాద్ వార్త

## ఉప్పల్‌లో ఉరేసుకుని డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** ఉరేసుకుని డిగ్రీ చదువుతున్న ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. నగరంలోని జగద్గిరి గుట్టకు చెందిన నిలుగురి కుమార్ బతుకుదెరువు కోసం ఉప్పల్ అజ్మత్ నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు. అయితే అతని కుమారుడు నిలుగురి రఘుప్రసాద్(20) హబ్సిగూడలోని ఓమెగా డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదవుతున్నాడు. అయితే గతంలో జగద్గిరిగుట్టలో ఉన్న సమయంలో అక్కడే నివసించే మేఘన అనే యువతిని ప్రేమించినట్లు తెలిపారు. అయితే కొద్ది నెలల క్రితం మేఘన ఆత్మహత్య చేసుకుందని, ఆమె మరణానికి రఘుప్రసాద్ కారణమని బంధువులు ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారని తెలిపారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపంతో ఉన్న రఘుప్రసాద్ శనివారం రాత్రి తల్లితో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా పక్క గదిలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మానసికంగా కుంగిపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ బియ్యం అక్రమంగా డంపింగ్ చేసిన వ్యక్తుల అరెస్ట్


రేషన్ బియ్యం డంపింగ్ చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ బాల కృష్ణనగర్‌లో రేషన్ బియ్యం అక్రమంగా డంపింగ్ చేసిన స్థావరంపై ఉప్పల్ పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మహ్మద్ షోయబ్ (35) పలువురు వ్యక్తులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి బియ్యం సేకరించి రామంతాపూర్‌లో డంపింగ్ చేసినట్లు తెలిపారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థావరంపై దాడి చేసి అందులోని సుమారు 30 క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వాహనాల దగ్ధం కేసు ఛేదించిన పోలీసులు

**మలక్‌పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** రెండు రోజుల క్రితం చాదర్‌ఘాట్ మెట్రోస్టేషన్ పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాల దగ్ధం కేసును చాదర్‌ఘాట్ పోలీసులు ఛేదించారు. ఇన్స్పెక్టర్ రాజు కథ నం ప్రకారం. మహారాష్ట్రకు చెందిన జకీర్ మహ్మద్(32) ఎనిమిది సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నాడు. మద్యం మత్తుకు బానిసైన అతను ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటాడు. నిద్రించడానికి పార్కింగ్ వాహనాలు ఇబ్బందిగా మారాయని మద్యం మత్తులో రెండు రోజుల క్రితం వాటికి నిప్పుపెట్టాడు, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఆదివారం అతడిని అక్బర్‌బాగ్ వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలోనూ మద్యం మత్తులో ఇతర ప్రాంతాల్లో వాహనాలను దగ్ధం చేశాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఇన్స్పెక్టర్ రాజు

# అట్టహాసంగా విజయోత్సవాలు









**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ ఏడాది విజయోత్సవాలు అట్ట హాసంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్ షో ఆకట్టుకుంది. హుస్సేన్‌సాగర్‌పై భారత వాయు సేనకు చెందిన సుశిక్షిత పైలట్‌లు విమానాలతో చేసిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. విమానాలతో పైలట్‌లు ఆకాశంలో రంగు రంగుల సింబల్స్ వేశారు. రెండు విమానాలతోవేసిన లవ్ సింబల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకేసారి ఆకాశంలో తొమ్మిది వైమానికి విన్యాసాలు అదరగొట్టాయి. మొత్తం 15 సూర్యకిరణ్ విమానాలతో చేసిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టు కున్నాయి. ఎయిర్ షోను తిలకించేందుకు నగర వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎయిర్‌షోను వీక్షించారు.

ట్యాంక్‌బండ్ కేంద్రంగా జరుగుతున్న ఈ వేడుక ల్లో ఎటుచూసినా మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతులతో ఆ ప్రాంతమంతా కొత్త శోభ సంతరించుకుంది. ఎయిర్‌షో ముగిసిన తర్వాత బిఆర్ అంబేద్కర్ సచివాలయం, ఎన్టీఆర్ గార్డెన్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద మూడు వేదికలను ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వడ్డే శంకర్ బృందం పాటల ప్రోగ్రాం, నీలా అండ్ టీం బోనాలు, కోలాటం ప్రదర్శన, మోహినిఅట్టం, భరత నాట్యం ప్రదర్శనలు కొనసాగాయి. రాత్రి రాహుల్ సిప్లిగంజ్ నేతృత్వంలో సంగీత కచేరి నిర్వహించారు. అలాగే నెక్లెస్ రోడ్డు, ఐమాక్స్ వద్ద హెచ్ఎండిఏ మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు నోరూరించాయి. విభిన్న రకాల వంటకాల తోపాటు చిరుతిళ్లతో కూడిన 100 స్టాళ్లు ఏర్పాటు చేశారు. నగరంలో ప్రసిద్ధిగాంచిన పలు బ్రాండెడ్ హోటళ్లు ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేశాయి. హైదరా బాద్ బిర్యానీ, మొఘలాయి వంటకాలు, చాట్, ఐసీక్రీం, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరీ ఐటమ్స్ నగరవాసులను ఆకట్టుకున్నాయి.





## విద్యాధర్‌కు కామధేను జాతీయ పురస్కారం

**హైదరాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** అతడి సూక్ష్మ కళ మహా అద్భుత సృష్టి..సూక్ష్మదర్శినితో చూస్తేతప్ప కనిపించని సూక్ష్మ కళాఖండాలను సృష్టించడంలో అతను దిట్ట. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాఖండాల నిపుణులు డాక్టర్ ముంజంపల్లి విద్యాధరచారి. అతడికి "కామధేను జాతీయ పురస్కారం 2024" సూక్ష్మ కళా రంగంలో దక్కింది. ఆదివారం బేగంపేటలోని ప్లాజా సమాగమంలో జరిగిన విశ్వగురు కార్యక్రమంలో అందజేశారు. హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద, విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ సీఈవో సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా కామదేను అవార్డు 2004 అందుకున్నారు. ఆవగింజపై ఆదిదేవుడు వినాయకుడి చిత్రాన్ని చిత్రించి జై గణపతి కి జై అంటూ తెలుగు అక్షరాలలో రాశారు. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరును తల వెంట్రుకపై ఆంగ్ల అక్షరాలలో రాసి ఆయనకే అందజేసి అభినందనలు అందుకున్నారు. ఒకే ఒక బియ్యపు గింజపై 133 తెలుగు అక్షరాలు గల జాతీయ గీతాన్ని రాసి అందరిని అబ్బుర పరిచారు. ప్రపంచంలోనే అతి చిన్న తాళం, తాళం చెవి తయారు చేసి 2004 సంవత్సరంలో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన పేరును నమోదు చేసుకున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సూది రంధ్రంలో ఆరు స్వర్ణ శివ లింగాలను అమర్చారు. గురివింద గింజలో ఇమిడే చదరంగాన్ని రూపొందించారు. ఫారెస్ట్ బీట్ పరీక్ష ప్రశ్నాపత్రంలో డాక్టర్ ముంజంపల్లి విద్యాధర్ చారికి సంబంధించిన ఒక ప్రశ్నను చేర్చడం అతడి సూక్ష్మ కళా ప్రతిభకు నిదర్శనం. భవిష్యత్తులో తన చేతిలో రూపుదిద్దుకున్న సూక్ష్మ కళాఖండాలతో హైదరాబాదు నగరంలో మ్యూజియంను ఏర్పాటు చేయాలన్నది తన లక్ష్యయమని డాక్టర్ విద్యాధర చారి వివరించారు

## కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త :**

కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడి పూజ నేత్రపర్వంగా జరిగింది. భక్తుల అయ్యప్ప శరణు ఘోషతో ప్రాంగణం పరిసరాలు మార్మోగాయి. అయ్యప్ప స్వామి మాలధారులు భజనలతో హోరెత్తించారు. మణికంఠుని నామస్మరణతో.. రంగురంగుల పూలతో 18 మెట్లను సుందరంగా అలంకరించి పడి వెలిగించారు. అనంతరం హరిహరసుతునికి అభిషేకం నిర్వహించారు. ఈ మహోత్సవానికి సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచే కాకుండా నగర వ్యాప్తంగా పెద్దఎత్తున అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్ప స్వామి పల్లకి సేవ అట్టహసంగా


కుటుంబసభ్యులతో కలిసి అయ్యప్ప స్వామికి పల్లకి సేవ నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

జరిగింది. అయ్యప్ప నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి అభిషేక కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పూజారి ఆత్రేయ ఆధ్వర్యంలో అభిషేకం మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. ప్రముఖ గాయకుడు జడల రమేష్ ఆధ్వర్యంలో భక్త సంద్రంలో ముం చిన భజన గీతాలహరి భక్తులను అలరించింది. ఈ వేడుకల్లో పార్లమెంటు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మన్, ఈటల రాజేందర్, డి.కె.అరుణ, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, దణపల్ సూర్య నారాయణ, రాకేష్‌రెడ్డి, బిజెపి అగ్ర నాయకులు చింతల రాంచందర్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతంరావు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు. మాల ధారణ ప్రాముఖ్యతను గురుస్వాములు వివరించారు. పడి పూజలో చేపట్టిన అభిషేక ఘట్టం కమనీయంగా కొనసాగింది. హరిహరసుతుడు అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో శాస్త్ర ప్రకారం నిర్వహించే పూజలు, అర్చనలు హైందవ సంప్రదాయానికి ప్రతీకలు. అత్యంత పవిత్రమైన ఈ వేడుకను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దంపతులు 24 ఏళ్లుగా ఏటా అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తు న్నారు. అయ్యప్పదీక్ష మతసామరస్యానికి ప్రతీక. కులం, మతం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే దీక్ష పర మార్థం. దీనిద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుంది. అయ్యప్ప దీక్ష తీసుకున్న వారు కఠిన నియమాలు ఆచరిస్తూ దీక్షా కాలాన్ని పరిపూర్ణంగావిస్తారనే మంచి పేరుంది. ఏటేటా అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాముల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అంతటి మహోన్నతమైన దీక్షలో భాగంగా సాంప్రదాయ విశ్వాసం ప్రకారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ప్రతిఏటా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

# రోగులపై దాడులు చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

*** ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు * గాంధీ, ఉస్మానియాలలో రోగుల భయాందోళనలు**

**హైదరాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయించుకోలేక ప్రభుత్వఆస్పత్రులకు వెళితే దాడులకు గురై గాయాలపాలవుతున్నారు. అసలే రోగాలలో ఇబ్బందులు పడుతూ వైద్యంకోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తే వైద్యుల వరకు చేరుకోకుండా దాడులపాలవుతున్నారు. కొన్నిసార్లు దాడులను తట్టుకోలేక వైద్యం సంగతి అటుంచి బ్రతుకు జీవుడా అనుకుంటు ఇంటిదారి పడుతున్నారు రోగులు. ఇదంతా ఎక్కడంటే తెలంగాణ రాష్ట్రానికే ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో తరచూ జరుగుతున్న సంఘటనలు. దాడులకు పాల్పడుతున్నది స్వయానా ఆస్పత్రి సెక్యూరిటీ గార్డులే. రోగులను చూడడానికి వచ్చే రోగి బంధువులో లేక స్నేహితులో అనుకుంటే పొరపడ్డట్లే. దాడులు జరుగుతున్నది రోగాలకు వైద్యం చేయించుకుందామని వచ్చినవారే. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులు సెక్యూరిటీ సిబ్బందివల్ల అప్రతిష్ట పాలవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులంటేనే భయం కలిగించే విధంగా వారి వ్యవహారశైలి ఉండడం వల్ల ప్రభుత్వ ఆస్పత్రులపట్ల నమ్మకం కోల్పోతున్నారు.

**సెక్యరిటీకా.. దాడులు జరిపేందుకా...**

ప్రభుత్వఆస్పత్రులలో రోగులు ఇష్టానుసారంగా వ్యవహరించకుండా నియంత్రించేందుకు థర్డ్ పార్టీ ద్వారా ప్రైవేట్ సెక్యూరిటీ విధానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాని సెక్యూరిటీ సిబ్బందే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది ప్రవర్తన వివాదాస్పదమవుతోంది. కొన్నిసార్లు దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఓపీ టికెట్ తీసుకున్న తరువాత ఎక్కడికి వెళ్లాలో తెలియక


గాంధీ ఆస్పత్రి వద్ద రోగులతో ఘర్షణకు దిగుతున్న ప్రైవేటు సెక్యూరిటీ

సెక్యూరిటీ సిబ్బంది యూనిఫాం చూసి వారిని అడుగుతారు. కొందరు సిబ్బంది సక్రమంగానే సమాధానం చెప్పినప్పటికీ చాలా వరకు సిబ్బంది చిరాకు పడుతూ కొందరు... దురుసుగా ప్రవర్తించే వారు కొందరైతే కొన్నిసార్లు రోగులు ఒకటికి రెండుసార్లు ప్రశ్నిస్తే మెడలమీద చెయ్యివేసి గెంటేయడం పరిపాటిగా మారింది. ఇద్దరు, ముగ్గురు రోగులు ఉంటే సెక్యూరిటీ సిబ్బంది ఏకమై దాడులకు పాల్పడుతున్నారు.

**జరుగుతున్న సంఘటనలు...**

వరంగల్‌కు చెందిన వెంకన్న నగరంలో క్యాబ్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. తన శరీరంలో నుంచి దుర్వాసన వస్తోందని నవంబర్ 27న సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వచ్చి ఓపీ టికెట్ తీసుకొని అవుట్ పెషెంట్ వార్డులోకి వెళ్లడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే నలుగురు, అయిదుగురు సిబ్బంది మెడలు పట్టి తోసేశారు. తాను డాక్టర్‌కు చూపించుకోవాలని ఎంత మొత్తుకున్నా తీవ్రంగా కొట్టి నెట్టివేశారు. బాధితుడు 100 ఫోన్‌చేయగా పోలీసులు వెంకన్నను సంప్రదించి సర్దుకుపోవాలని చెప్పడం గమనార్హం. తనను ఎంతకూ వైద్యులవద్దకు వెళ్లనివ్వక పోగా చిలకలగూడ అవుట్‌పోస్టు సిబ్బందికి ఫిర్యాదు చేస్తే వారూ పోనిలే పట్టించుకోకు... ఎందుకు సెక్యూరిటీ వాళ్లతో పెట్టుకుంటావు అని పంపించి వేశారని బాధితుడు తెలిపారు. చివరికి వెంకన్న గాయాలతోనే వెనుతిరిగాడు. అత్యవసర సమయంలోనూ తీవ్ర గాయాలపాలైన వారు వైద్యం పొందడానికి వస్తే రోగి వెంట ఎవరిని లోనికి వదలకుండా కఠినంగా వ్యవహరిస్తుంటారు. కొందరైతే బహిరంగంగానే డబ్బులు అడుగుతూ రోగులను, వారి బంధువులను ఇబ్బందుల పాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన వారు ఎవరూ, ఎలాంటి పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చారో అనికూడా చూడకుండా దురుసుగా మాట్లాడడం, అమర్యాదగా ప్రవర్తించడం సెక్యూరిటీ గార్డులకు పరిపాటిగా మారింది. దౌర్జన్యాలు చేయడం అలవాటుగా మారింది. తాజాగా ఉస్మానియా ఆస్పత్రిలో పరిస్థితుల విషయమై అవసరమైన ఫొటోలు తీసుకునేందుకు వెళ్లిన ఒక పత్రిక ఫొటోగ్రాఫర్‌పై సెక్యూరిటీ సిబ్బంది దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. దీంతోపాటు అతడి కెమెరాను లాక్కొని ఇబ్బందులకు గురిచేశారు. ఇలాంటి తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు ఎంతమాత్రం స్పందించకపోవడం విడ్డూరంగానేఉంది. విలేకరులపరిస్థితే ఇలాఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

**శిక్షణ అనవసరం అనుకున్నారా...**

సెక్యూరిటీ కోసం సిబ్బందిని ఏర్పాటు చేసుకునే క్రమంలో సిబ్బందికి ఏమాత్రం శిక్షణ లేకుండానే నియమించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రిని ఆశ్రయించేవారిపట్ల ఎలా ప్రవర్తించాలి, ఎలా మాట్లాడాలో తర్ఫీదునివ్వాలి. అంతే కాకుండా అత్యవసర పరిస్థితిలో ఉన్నవారిపట్ల సాటి మనిషిగా ఎలా స్పందించాలో శిక్షణనివ్వాల్సి ఉండగా తూతూ మంత్రంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తే సెక్యూరిటీ సిబ్బందిని వెనకేసుకురావడం మరింత ఆశ్చర్యం కలిగించే విషయం. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆస్పత్రులకు రోగులు రావడం కాకుండా వైద్యులు, సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే వచ్చే పరిస్థితులు వచ్చే అవకాశం లేకపోలేదు.

## కనులవిందు సౌందర్య కూచిపూడి నాట్య ప్రదర్శన

**రవీంద్రభారతి, డిసెంబరు 8 ప్రభాతవార్త :** ప్రముఖ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నాట్య మయూర సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ రాంకోటిలోని భారతీయ విద్యాభవన్ వేదికలో నాట్యాచార్య మద్దాళి సౌందర్య కౌశిక్ శిష్యుల నాట్యప్రవాహ విచ్చేసిన అశేష కళా, నాట్యప్రియులకు కనులవిందు చేసి ప్రశంసలందుకున్నారు. 40మందికిపైగా శిష్యుల కూచిపూడి నాట్యప్రవాహ ముందుగా దైవానికి భక్తితో కూడిన సమర్పణ, దేవతలకు, గురువులకు, సభకు నమస్కరిస్తూ సభవందనం; అరభి రాగంలో గణేష్ వందనం ఝుంఝుం తననా; శ్రీ వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ అన్నమాచార్య కీర్తన నారాయణతే; గురువు వేదాంతం జగన్నాథశర్మకు నాట్యమయూర సమర్పణ జతీస్వరం; శ్రీఅలమేలుమంగ మంత్రముగ్ధమైన అందాన్ని వర్ణించే అన్నమయ్య కీర్తన చక్కని తల్లికి; హరికాంబోజి రాగంలో మహావిష్ణువును స్తుతించే శక్తివంతమైన శ్లోకం గరుడ గమనం; కూచిపూడి శైలిలో సంప్రదాయ తరంగం నీలమేఘ సరిరా; చివరిగా అందరి శుభాశీస్సులు సమస్తలోక శాంతిని కాంక్షిస్తూ మంగళం అంశాలను అత్యంత అద్భుంగా ప్రదర్శించి తన్మయుల్ని చేశారు. నాట్యాచార్యులు సౌందర్య కౌశిక్ నట్టువాంగం, వి.శ్రీవల్లిశర్మ గాత్రం, శ్రీధరాచార్య మృదంగం, భవానిప్రకాష్ వేణువు, ఎం.వాసుశాస్త్రి వయోలిన్‌లతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. చివరిగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు నాట్యప్రవాహలో పాల్గొన్న కళాకారులకు ఆశీస్సులందించి సంస్థ, గురువు సౌందర్యను అభినందించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు. 27 యేండ్ల తర్వాత ఒకే చోట ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు కలుసుకొని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన చిన్ననాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని ఒకరిని ఒకరూ పలకరించుకున్నారు. విద్యా బుద్దులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీరాములు, నర్సింలు, జనార్ధన్, విద్యార్థులు వెంకటరెడ్డి, జైన నరేష్, నాగరాజు, నరసింహ్మారెడ్డి, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, స్వామి, రాజయ్య, శ్రీనివాస్, రవికాంత్, చంద్రం, రఘుపతి, సుధాకర్, మధు, నసియా అసిన్, పుష్పలత, వాసవి, పద్మ, స్వరూప, వనిత, శ్రీలత, సులోచన, చంద్రకళ, కనకలక్ష్మీ, శోభ, సబియా తదతరులు పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 8, ప్రభాతవార్త :**సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని తడకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. నాటి జ్ఞాపకాలను, అక్షరాలు నేర్పిన పాఠశాలను వారెవ్వరూ మరిచిపోలేదు. భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాలను తరగతి గదులను తీపి జ్ఞాపకాలను గుండెల్లో పదిలంగా దాచుకున్నారు. పాఠశాలలో చదివిన చిన్ననాటి జ్ఞాపకాలు, అల్లరి వేషాలు, తమాషాలు గుర్తుకు చేసుకున్నారు. విద్యా బుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సత్కారించారు.

## మృతదేహాలను సందర్శించి.సీపీ డాక్టర్ అనురాధ



మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 8, ప్రభాతవార్త** :గజ్వేల్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి చెందిన సంఘటన విషయం తెలుసుకున్న సీపీ డాక్టర్ అనురాధ వెంటనే గజ్వేల్ మార్చరీలో ఉన్న పరంధాములు, వెంకటేష్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాద సంఘటన విషయాన్ని పోలీసు అధికారుల ద్వారా అడిగి తెలుసుకొని బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులైన పోలీసు కానిస్టేబుళ్ల మృతి చెందడం విపార్టుమెంట్‌కు తీరని లోటన్నారు. కాగా సీపీ అదేశాల మేరకు గజ్వేల్ ఇంచార్జి ఏసీపీ మధు, గజ్వేల్ సీఐ సైదా, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి గజ్వేల్ మార్చరిలో మృతదేహాలకు పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరుపున రూ.60 వేలు కుటుంబీకులకు అందజేశారు. కాగా పరంధాములు స్వస్థలం పెద్దకోడూరు, వెంకటేష్ స్వస్థలం గాడిచెర్లపల్లిలో సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, చిన్నకోడూరు, దౌల్తాబాద్ ఎస్ఐలు బాలకృష్ణ, శ్రీరామ్‌ప్రేమ్‌దీప్, రాయపోల్ పోలీసు సిబ్బంది బ్యాచ్ మెంటు మిత్రులు ప్రజాప్రతినిధులు, స్నేహితులు, ప్రజలు మృతదేహాలపై పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు.

## యూత్ కాంగ్రెస్ నాయకులను సన్మానించిన ఉజ్వల్‌రెడ్డి



యూత్ కాంగ్రెస్‌నాయకులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ పార్లమెంట్ నేత డాక్టర్ ఎస్ ఉజ్వల్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని ఆదర్శనగర్‌లోని తన స్వగృహంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ అసెంబ్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పట్లోళ్ల నాగిరెడ్డి, రారష్ట కార్యదర్శిగా హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా వసిం, బబ్లూ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శివసాయి, అసెంబ్లి ప్రధాన కార్యదర్శులుగా మోయిన్, కార్తీక్, నియోజకవర్గంలోని కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ముజాహిల్, కిరణ్‌గౌడ్, సుభాష్, సునీల్, రాఘవేంద్రలు ఇటీవల ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ బాధ్యులుగా ఎన్నికైన వారిని సన్మానించి పార్టీ అభ్యున్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉజ్వల్‌రెడ్డి సూచించారు.

# నర్సాపూర్‌లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

### బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలింపు



నర్సాపూర్‌లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించిన వాహనాన్ని స్వాధీన పరచుకొని పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనం దృశ్యం

**నర్సాపూర్ డిసెంబరు 8. ప్రభాతవార్త.** పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఒక వాహనం లో తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు నర్సాపూర్ రెవెన్యూ అధికారులు నర్సాపూర్ పట్టణంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈఘటన వివరాల్లోకి వెళితే... నర్సాపూర్ పట్టణంలోని పెద్దమ్మ కాలనీలో భువనగిరి ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. నర్సాపూర్ లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో స్థానికులు కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యు అధికారులు తక్షణమే స్పందించి రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫైజల్ సిబ్బందితో రేషన్ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్నావాహనం వద్దకు చేరుకొని వాహనాన్ని అదుపులో తీసుకొని పరిశీలించి వాహనంలో ఉన్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నారు. అనంతరం పంచనామ నిర్వహించి రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయమై మండల తహశీల్దార్ శ్రీనివాస్ ను వివరణ కోరగా నర్సాపూర్ పట్టణంలోని పెద్దమ్మ కాలనీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందగానే రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఫైజల్ సంఘటన స్థలానికి పంపించి అట్టి వాహనాన్ని 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరచుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని భువనగిరి ప్రాంతానికి చెందిన వ్యాపారి భాస్కర్ గా గుర్తించామన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉచితంగా రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా ఈ విధంగా వ్యాపారం చేస్తున్నారన్నారు. ఈ పట్టుబడిన బియ్యాన్ని సివిల్‌సప్లయ్ అధికారులు వచ్చి పరిశీలించిన తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఉచితంగా ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం పేద ప్రజలకే చెందాలని పేర్కొంటూ లబ్ధిదారులు ఎవరైనా వ్యాపారస్తులకు అమ్మిన కొనుగోలు చేసిన చట్టపరంగా చర్యలు తీసుఉంటామని తహసిల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. .

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



బీమా చెక్కును అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 8 (ప్రభాతవార్త)**:బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాము అందుబాటులో ఉంటామని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని 10వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త చిక్కుడు కిరణ్‌కుమార్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో బిఆర్ఎస్ పార్టీ నుండి మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా రూ.2 లక్షల చెక్కును ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో దాదాపు 97,500 సభ్యత్వాలు కలిగి ఉన్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ అన్నారు. ఇప్పటి వరకు 380 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.7.60 కోట్ల ప్రమాద బీమా డబ్బులు అందజేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అధికారం మనదే అని, మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలను అడ్డుకుంటూ పథకాలు అమలు చేసేలా ప్రశ్నిస్తూ ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్.సి.రాజమౌళి, వైస్ ఛైర్మన్ జకియొద్దీన్, ఏఎంసి మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, రాష్ట్ర నాయకుడు విరాసత్‌అలీ, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు ఆకుల దేవేందర్, గుంటుకు రాజు, బాబా షేర్‌అలీ, ఉమర్, అహ్మద్, పాల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## గర్భిణీ మహిళలకు సీమంతం



గర్భిణీ మహిళకు సీమంతం చేస్తున్న అంగన్వాడీ టీచర్ నాగరాణి

**-గజ్వేల్, డిసెంబరు 8 (ప్రభాతవార్త)**: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ నాగరాణి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిహెచ్‌ఓ, ఆశ వర్కర్, అంగన్వాడీ ఆయా లావణ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన కొమ్ము నవీన్‌కుమార్



ఎమ్మెల్సీ కవితతో కొమ్ము నవీన్‌కుమార్

**ములుగు, డిసెంబరు 8 (ప్రభాతవార్త)**:తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గజ్వేల్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ కొమ్ము నవీన్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏరనపడి ఏడాది కాలం పూర్తయ్యింది కానీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలు చేయకుండా అడుగడుగునా ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల మైండ్ డైవర్ట్ చేస్తున్నారని, హైడ్రా, కొడంగల్‌లో ఫార్మా కంపెనీ అని ప్రతి విషయంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ వెనకడుగు వేయదని, ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేస్తా



యక్ష బాజ్మీన్‌ను సన్మానిస్తున్న తూంకుంట ఆంక్షరెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 8 (ప్రభాతవార్త)**:యువజన కాంగ్రెస్ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యక్ష బాజ్మీన్ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోటీపడి ఉమ్మడి సిద్దిపేట జిల్లాలో భారీ విజయం సాధించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన యువతకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డిని కలువగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన యక్ష బాజ్మీన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## రెచ్చిపోతున్న కేబుల్ దొంగలు



స్టార్టర్ డబ్బాలో ని విద్యుత్ పరికరాలను చోరీచేసిన దృశ్యం

**శివ్వంపేట, డిసెంబరు 8 ( ప్రభాతవార్త** )రైతులు ఎంతో కష్ట పడి మోటార్ల స్టార్టర్ల డబ్బాలు ఏర్పాటు చేసుకొని వరి సాగు చేస్తుంటే గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి స్టార్టర్ డబ్బాల, కేబులు దొంగలు రెచ్చిపోతున్నారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన శివ్వంపేటలో బోరుబావుల నుండి గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్ డబ్బాలు, కేబుల్ విద్యుత్ పరికరాలను ఎత్తుకెళ్లారు. తరచుగా స్టార్టర్ డబ్బాలు, కేబుల చోరీ కావడంతో రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. చోరీ కావడంతో రైతులు మోటార్లు నడవక ఆందోళన వ్యక్తం చేశారు.

## నూతన ముదిరాజ్ సంఘం ఏర్పాటు

**శివ్వంపేట, డిసెంబరు8 (ప్రభాతవార్త) :** మండలంలోని గంగాయపల్లి గ్రామంలో నూతన ముదిరాజ్ సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్షపతి ముదిరాజ్ సమక్షంలో గంగయ్య పల్లి నూతన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నాగరాజును ఏకగ్రీవ తీర్మానం తోని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్షపతి ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులందరూ సమన్వయంతో కలిసికట్టుగా ఉంటూ రాజ్యాధికారాన్ని చేపట్టే ముదిరాజుల అందరూ ముందుకు సాగాలని ప్రతి ముదిరాజ్ బిడ్డ తమ ఆలోచనలకు పదును పెట్టి ముందుకెళ్లే విధంగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముద్దగల లక్ష్మీ నరసయ్య ముదిరాజ్. సలహాదారులు పోల్దాస్ వెంకటస్వామి ముదిరాజ్, గంగాయపల్లి గ్రామ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి పుస్తెమెట్టెలు బహుకరణ



అప్ పుస్తె మట్టెలు అందజేస్తున్న నాయకులు

**శివ్వంపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన బొగ్గుల లక్ష్మి స్వర్గీయ బొగ్గుల వేణు దంపతుల కూతురు వైష్ణవి వివాహానికి ఆదివారం మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా తన సొంత నిధులతో పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెండ్లిలకు తన వంతు తప్పకుండా అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గుల యాదగిరి, కుమ్మరి శంకర్, అశోక్ కుమార్, దొడ్లే ఆంజనేయులు, చిక్కుడు బాలేష్, చాకలి రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘట్‌కేసర్ పట్టణ బంద్‌కు జెఏసి పిలుపు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలేనిరాహారదీక్షకు మద్దతుగా సోమవారం బంద్ పాటించాలని జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గత 15 సంవత్సరాలుగా ఆర్ఓబీ పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. వంతెన కోసం అనేక సార్లు, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించామని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ గత 8 రోజులుగా అన్ని వర్గాల ప్రజలు రిలేనిరాహారదీక్షలు చేస్తున్నారని తెలిపారు. దీనికి మద్దతుగా సర్కార్‌పై ఒత్తిడి తెచ్చే ఒదుకు ఘట్‌కేసర్ పట్టణంలోని వ్యాపార కేంద్రాలు, పాఠశాలలు బంద్ చేయాలని పిలుపు నిచ్చారని వ్యాపారస్తులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించి మూసి ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు..నేడు

**ప్రేవేటు పాఠశాలలు బంద్..**

ఆర్ఓబీ పూర్తి కోసం జేపీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఘట్‌కేసర్‌లోని అన్ని ప్రైవేటు పాఠశాలలు సోమవారం బంద్ పాటిస్తున్నాయని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దర్గ జితేందర్‌రెడ్డి తెలిపారు.

## నర్సాపూర్ నుండి బాలానగర్‌కు అదనంగా బస్సులు నడపండి



నర్సాపూర్ ఆర్టీసి బస్టాండ్‌లో హైద్రాబాద్ బస్సు కోసం గంటల తరబడి వేచి చూస్తున్న ప్రయాణీకులు

**నర్సాపూర్ డిసెంబరు 8. ప్రభాతవార్త.**:నర్సాపూర్ ఆర్టీసీ బస్ డిపో నుండి ప్రతి రోజు నర్సాపూర్ నుండి బాలానగర్ కు లేదా గండి మైసమ్మ వరకు అదనంగా ఆఆర్టసీ బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ బస్టాండ్ లో వేచి ఉన్న ప్రయాణికులు మాట్లాడుతూ గజ్వేల్ సంగారెడ్డి పటాన్చెరు పట్టణాలకు పది నిమిషాలకు ఒక బస్సు నడుపుతున్నారు అయితే హైదరాబాద్, సికింద్రాబాద్ పట్టణాలకు గంట నుండి రెండు గంటల వరకు ఒక బస్సు నడుపుతున్నారని వారు ఆరోపించారు. దీంతో ప్రయాణికులు హైదరాబాద్ కు వెళ్లాలంటే అనేక అవస్థలు పడుతూ వెళుతున్నారని వాపోయారు. దీంతో హైదరాబాద్ కు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసిపోయి అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ మేరకు నర్సాపూర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ స్పందించి ప్రయాణికుల అవస్థలు గమనించి హైదరాబాద్ కు గాని సికింద్రాబాద్ కు గాని అదనంగా ఆర్టిసి బస్సులు వేయాలని అంతేగాక కనీసం బాలానగర్, గండి మైసమ్మ వరకైనా ఆర్టీసీ బస్సులు అదనంగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ కు వెళ్లే ప్రయాణికుల అవస్థలు గమనించి ఆర్టీసీ డిపో మేనేజర్ హైదరాబాద్ కు బాలానగర్ కు ఆర్టీసీ బస్సులు అదనంగా వేసి ప్రయాణికులకు ప్రయాణసౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నత్నాయిపల్లిలో తాగునీటికి ఇబ్బందులు

**నర్సాపూర్ డిసెంబర్ 8. ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో గత పది రోజులు గా తాగునీటికి గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కాకపోవడం, గ్రామంలోనున్న వాటర్ ట్యాంక్‌ల బోర్‌మోటార్‌లు కాలి పోవడంతో గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది. మా గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేయాలని సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు వినతి చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఇంటి వద్ద గల బోర్ వద్ద తాగునీటి కోసం మహిళలు బారులు తీరి ఇబ్బందులు పడుతూ నీటిని తెచ్చుకుంటున్నారు. గత పది రోజులుగా గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నత్నాయపల్లి గ్రామానికి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకొని మా గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



**నర్సాపూర్ డిసెంబరు 8. ప్రభాతవార్త.** నర్సాపూర్ పట్టణంలోని నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనగల శ్రీ అయ్యప్ప దేవాలయంలో ఆదివారం నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌గౌడ్ గురుస్వామి. అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిఫల్ ఛైర్మన్ అశోక్‌గౌడ్ గురుస్వామి, పాపగారి పెద్ద రమేష్‌గౌడ్ గురు స్వాముల తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, అయ్యప్ప స్వామి దేవాగౌడ్ తదితర అయ్యప్ప స్వాములు నియమ నిష్టలతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మెట్ల పూజ నిర్వహించి, అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం ఈ ఆలయ ప్రాంగణం అంతా అయ్యప్ప శరణు ఘోషతో భజన పాటలతో మారు మ్రోగింది. ఈ మేరకు ఈ మహపడి పూజ బాగంగా నిర్వహించిన భజన కార్యక్రమంలో అయ్యప్ప స్వామి పై పాడిన భజన పోటలు పలువురిని ఎంతగానో అలరించాయి. ఈ మేరకు నర్సాపూర్ పట్టణంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది.

## అనాధ యువతి వివాహానికి ఆర్థిక సహాయం



**గజ్వేల్, డిసెంబరు 8 (ప్రభాతవార్త)**:గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు అలేఖ్య అనే యువతి వివాహానికి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిచిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించడం జరిగిందని, వారిది నిరుపేద కుటుంబం కావడంతో వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు మద్ది రాజిరెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు రామాగౌడ్, బుచ్చిరెడ్డి, రాములుగౌడ్, అయ్యాలం, బాలయ్య, రాజు, రమేష్, కిష్టారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాంపల్లి పాల్గొన్నారు.

## నిరాహారదీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలేనిరాహారదీక్షలు ఆదివారంతో 8వ రోజుకు చేరుకున్నాయి. జేపీసీ ఆధ్వర్యంలో నిత్యం పలువురు నాయకులు వచ్చి దీక్షలో కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వచ్చి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. మంగు రాధిక, విష్ణుప్రియ, సుభాషిణి, రమాదేవి, మాధవి, మమతశర్మ, ఆశలు దీక్షలో కూర్చున్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు వంతెన పూర్తి చేయించేందుకు శాయశక్తులా కృషి చేశామని మల్లారెడ్డి తెలిపారు. నిధుల సమస్య ఉంటే సీఎం కేసీఆర్‌తో చర్చించి నిధులు కూడా మంజూరు చేయించామని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అతన్ని రద్దు చేసి సత్తిరెడ్డికి కాంట్రాక్ట్ ఇచ్చామని ఆయన తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న గేటు సమస్య పరిష్కారానికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుందన్నారు. బిజెపి అధ్యక్షులు విప్పర్ల హనుమాన్, సొసైటీ మాజీ ఛైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బచ్చు ప్రమోద్‌గుప్త, అల్లు కమలాకర్, సాలె వ్వేరు కిరణ్, నగేశ్‌గుప్త, రొడ్డ యాదగిరి, పల్లె విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజలుచేస్తున్న ఎమ్మెల్యే

## దుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజలు

**హైదరాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నల్లకుంట, టిఆర్‌టి కాలనీలో శ్రీదుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజలకు పెద్దఎత్తున భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని నిర్మాణ భూమి పూజలో పాల్గొని శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నల్లకుంట కార్పొరేటర్ ఎన్.అమృత, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా కాలని వాసులు పాల్గొన్నారు.

## పాటల పల్లకిలో 32 గంటలును విజయవంతం చేద్దాం

### తెలంగాణ కళాకారులు కంటె సాయన్న


పోస్టర్ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న కంటె సాయన్న

**ముషీరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం నుండి కొనసాగే పాటల పల్లికిలో 32 గంటలు కార్యక్రమంలో కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ కళాకారుడు కంటె సాయన్న పిలుపునిచ్చారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో దగాపడ్డ కళాకారుల డప్పుల మోత పేరుతో నిర్వహించబోయే పాటల పల్లికిలో 32 గంటలు కార్యక్రమ గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సాయన్న మాట్లాడుతూ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిసెంబర్ 12, 13 తేదీలలో తెలంగాణ కళాకారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిజమైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వకుండా దగాచేసిందని, ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్న పాటలపల్లకిలో 32 గంటలు కార్యక్రమం ద్వారా కళాకారుల బాధలను పాటల రూపంలో ప్రభుత్వానికి తెలియచేద్దామన్నారు. ఆవిష్కరణ సభలో భూంపల్లి అశోక్, గ్యార యాకన్న, మౌనిక, గడ్డమీది సంపత్, కొడముంజ రవి, పాట రాజశ్రీ, మహేష్, శ్రీరామ్, కళ్యాణి పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉండాలి : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** కుల,మత వర్గ విభేదాలు లేకుండా అన్నివర్గాల ప్రజలు కలిసి ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని మహబూబ్ సుభాని బాబా దర్గాలో నిర్వహించిన ఉర్సు వేడుకల్లో ఆయన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను మైనార్టీ నాయకులు జంపన ప్రతాప్‌కు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ముఖేశ్‌యాదవ్, సాయి, శంకర్, మినాభాస్కర్, రమని, సత్య నారాయణ, షకీల్, జగన్, దత్తూ, రాజేశ్ పాల్గొన్నారు.

**చిన్నతోకట్టలో...**

చిన్నతోకట్ట శ్రీకాంత్ నివాసంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాములు కఠిన ఉప వాస దీక్షలు చేసి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారన్నారు. ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

## ముగిసిన సుబ్రమణ్య స్వామి షష్టి మహోత్సవ వేడుకలు

**కంటోన్మెంట్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం షష్టి మహోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఉదయం సుబ్రమణ్యస్వామి మూలమంత్ర హోమం, సాయంత్రం రథోత్సవం, సర్వ సేవలు ఘనంగా జరిగాయి. వందలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, నరేశ్‌లు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులకు ఎలాంటి అ సౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు పి.నరిసింగ్‌రావ్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : మహేశ్వర్‌రెడ్డి

**కంటోన్మెంట్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి,సిఈఓ, ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి 1వ వార్డు కడక్‌పుర, పంప్‌హౌజ్ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. తన విజ్ఞప్తి మేరకు సిఈఓ మధుకర్ నాయక్ స్పందించి అభివృద్ధి పనులు చేపట్టినందుకు అభినందనలు తెలియజేశారు.

## 10 నుంచి టిఎన్‌జిఓలకు క్రీడాపోటీలు

**గోషామహల్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** ప్రతి ఏటా మాదిరగానే ఈ యేడుకూడా ఈ సంవత్సరం డిసెంబర్ 10వ తేది నుంచి టిఎన్‌జిఓ ఉద్యోగుల గగహన్‌మహల్ మైదానంలో 11వ ఆటల, పోటీలను ప్రారంభం అవుతున్నట్లు టిఎన్‌జిఓ సెంట్రల్ కమిటి ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ తెలిపారు. ఈ పోటీలను రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి సీతక్క, మైనార్టీ వెల్ఫేర్ స్కూల్ చైర్మన్ పయీమ్ ఖురేషీ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్‌లు హాజరవుతారన్నారు. ఈ మేరకు జిల్లా భవనంలో జిల్లా ఉద్యోగులతోపాటు యూనిట్స్ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పురుషులకు క్రికెట్‌పోటీలు, కబడ్డీ, వాలీబాల్, చెస్, కారోమ్స్, టేబుల్‌టెన్నిస్, రంగోలి,సింగింగ్, టాగ్ ఆఫ్‌వార్, లెమన్‌స్పూన్ ఉంటాయన్నారు. ఈ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహమ్మద్ నజీర్, అరుణ్, శ్రీనివాస్‌గౌడ్, టిఎన్‌జిఓ జిల్లా కార్యదర్శి విక్రమ్, కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, సభ్యులు ఉమర్‌ఖాన్, కె.శ్రీనివాస్, నరేష్‌కుమార్, గీత తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్రాయిమ్‌పై రాగి వీరాచారి మనుషుల దాడి

**చిక్కడపల్లి, డిసెంబరు 8 ప్రభాతవార్త:** గోల్కొండ చౌరస్తాలోని ప్రతిష్టాత్మక హెబ్రోన్ చర్చ్ కార్యాలయంలో దైవ సేవకులు ఎఫ్రాయిమ్‌పై రాగి వీరాచారి అనుచరులు దాడిచేశారు. ఈ దాడిలో ఆయన చేయికి గాయమైంది. దీనిపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో హెబ్రోన్ చర్చి కార్యాలయంలోలోకి రాగి వీరాచారి అనుచరులు జి జాన్ సుందర్రావు, స్టీవెన్ చిన్నప్ప, ఈ మ్యాతూ, రవి తిమోతి లతోపాటు సుమారు 25 మంది ప్రవేశించి దౌర్జన్యానికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడే ఉన్న తాను ఇదేమిటని ప్రశ్నించగా నాపై పదునైన వస్తువుతో దాడి చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు

**చిక్కడపల్లి డిసెంబరు 8 ప్రభాతవార్త :** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభ ఆవరణలోని రాహుల్ గాంధీ చౌక్ లో నిర్వాహకుడు గడ్డం రాజేష్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా మాస్టర్ జి, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు పాల్గొని అంబేద్కర్ కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లక్ష్మణ్, భాస్కర్ రెడ్డి, సునీత, రవి, జయ, శ్రీనివాస్, హరికృష్ణ తద్దితరులు పాల్గొన్నారు

# ఎస్సీ వర్గీకరణను సాధిస్తాం : నగేష్‌మాదిగ


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఎన్ఎంసి దళిత ఐఖ్య వేదిక సంఘం అధ్యక్షులు మేకల నగేష్ మాదిగ

**నిజాంపేట్, డిసెంబరు 8, ప్రభాతవార్త** నిజమైన అంబేద్కర్ వాదులు మాదిగల మాలల ఐక్యతను పెంచడానికి దోహదపడాలని నిజాంపేట్ మున్సిపల్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మేకల నాగేష్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కొంతమంది స్వార్థపరులు వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. నిజమైన అంబేద్కర్‌వాదులు అయితే మనలో ఉన్న వ్యత్యాసమైన ఎస్సీ వర్గీకరణ ఫలాలను జనాభా దామాషా ప్రకారంగా పంచుకోవడానికి మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపునకు, మాల మేధావులు ఎవరైనా చర్చకు రండి అని సవాల్ విసిరారు. నిజమైన అంబేద్కర్‌వాదులు బౌద్దులు అయితే సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి రాజ్యాధికార ప్రయాణంలో కలిసి ప్రయాణించాలని, అదేవిధంగా మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాల నుండి న్యాయమైన పోరాటంచేస్తూ సుప్రీం కోర్టు ద్వారా తీర్పు తీసుకురావడంతో కొంతమంది స్వార్ధ రాజకీయ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. కొంతమంది స్వార్ధ రాజకీయ నాయకులు స్వలాభాల, పదవుల కోసం, కృష్ణమాదిగను విమర్శిస్తున్నారే తప్ప, వారికి జాతి మీద ప్రేమ ఏ మాత్రం లేదని మేకల నగేష్ ఎద్దేవా చేశారు. ఎన్ని శక్తులు అడ్డొచ్చినా ఎన్ని కుతంత్రాలు చేసిన మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని, ఇకనైనా స్వార్ధాన్ని వీడి అన్నదమ్ముల్లాగ కలిసి వర్గీకరణ ఫలాలను ఉపకులాలందరం పంచుకుందామని అన్నారు. కార్యక్రమంలో జలగం చంద్రయ్యమాదిగ, బురికి రాములుమాదిగ, అబ్రహం మాదిగ తదితరులు పాల్గొన్నారు.


నాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వెలమ నాయకులు

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు

**నాచారం, డిసెంబరు 8 ప్రభాతవార్త:** వెలమ సామాజిక వర్గంపై వివాదాస్పద వాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఆదివారం వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ ఈస్ట్ నాయకులు నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్యే శంకర్ వాఖ్యలను నిరసిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదట నాచారంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఇన్స్‌పెక్టర్ రుద్వీం కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు,బిజేపీ నాయకులు ఎం.నవీన్ రావు, కోషాధికారి ఎం.కిషన్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ తమ సామాజిక వర్గంపై అసభ్య పదజాలంతో దూశిస్తూ వెలమ కులస్తులను అంతుచూస్తానని బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనం అన్నారు. ఆయనపై కాంగ్రెస్ అదిష్టానం చర్యలు తీసుకోవాలని, పోలీసు ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శంకర్ వాఖ్యల వల్ల మా మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆయన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయనపై విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.సత్యనారాయణ రావు, శ్యాంసుందర్ రావు, కొండల్‌రావు, రాజేందర్ రావు, ఆర్.వి రాజేశ్వర్ రావు, ఎం.నవీన్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కృషి, నేర్పుతో విజయం తథ్యం : పెద్దపల్లి ఎంపి వంశీ


పెద్దపల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీ

**చిక్కడపల్లి, డిసెంబరు 8 ప్రభాతవార్త:** కృషి మరియు నేర్పుతో విజయం తథ్యమని పెద్దపల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. గడ్డం వంశీ, ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం అధిపతి ప్రొఫెసర్. డాక్టర్ జహంగీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంబీఏ విద్యార్థులు బహుళ ప్రావీణ్యత గురించి వివరించారు ప్రతి విద్యార్థి తన బ్రాండ్ తానే నిర్వహించుకోవాలని ఎల్లప్పుడూ తన నైపుణ్యాన్ని అప్డేట్ చేసుకోవాలని సూచించారు. యువతలో అనుక్షణం ఆలోచన పరమైన విలువలను కల్గి నిలుపుకోవాలని, నేటి సమాజంలో ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు నేర్చుకుని ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవాలని అన్నారు. తన జీవితమే ఒక ఉదాహరణ అని తెలియజేస్తూ ఏ విద్యార్థి అయినా ప్రత్యేకమైన టాలెంట్ను కలిగి ఉండి దానికి సహాయ సహకారాలు తన వైపు నుండి తప్పనిసరిగా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణు ప్రియ. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ అప్పలయ్య మీసాల, బోధన మరియు బోధనేతర సిబ్బంది ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పద్మజ విశ్వాస్ స్థాపించిన తరంగిణి మ్యూజిక్ డాన్స్ అకాడమీ శిష్య బృందంచే కూచిపూడి నృత్యం, గాత్ర కచేరీ, కీబోర్డు వయోలిన్ ప్రదర్శనలు నిర్వహించారు. నృత్య భూషణ్ డా.అంజుబాబు, శ్రీనివాస్, సినీయాక్టర్ చంద్రశేఖర్, టివి కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


ఫణి నారాయణ కు సుస్వర వైణిక బ్రహ్మ బిరుదు ప్రదానం చేసిన దృశ్యం

## ఫణి నారాయణకు సుస్వర వైణిక బ్రహ్మ బిరుదు ప్రదానం

**చిక్కడపల్లి డిసెంబరు 8 (ప్రభాతవార్త):** శ్యామా గాయత్రీ మ్యూజిక్ అకాడమీ అధినేత్రి, ప్రముఖ గాయని చిల్ల శివ పార్వతి ఆధ్వర్యంలో విద్వాన్ వడలి ఫణి నారాయణ కు సుస్వర వైణిక బ్రహ్మ ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో జరిగింది. ముఖ్య అతిథిధులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథ రావు హాజరై పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంగీత విదుషీమణి అన్నపూర్ణ, తెలుగు విశ్వవిద్యాలయం సంగీత అధ్యాపకురాలు లక్ష్మి శేషాచార్యులు, సేవరత్న వడ్లకొండ వెంకట రావు, గాయకుడు కళ్యాణ్ కోటం రాజు, ఇంచార్జి మేఘన, నిర్వాహక సంస్థ కార్యదర్శి చేపూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చిల్లా శివ పార్వతి శిష్య బృందం నిర్వహించిన సంగీతం, నృత్య ప్రదర్శనలు, సినీ గీతాలాపన అందరిని అలరించింది.

## మమహానటి సావిత్రికి సినీ పాటలతో నివాళి



మహా నటి సావిత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబరు 8 ప్రభాతవార్త:** లాహిరి లాహిరి లాహిరిలో జగమే వూగెనుగా, తూగెనుగా, నీవే నా నన్ను పిలిచినది నీవే నా నన్ను పిలిచినది వంటి సాహితీ సంగీత భరితమైన పాటలు ఏభై ఏళ్ల క్రితం విడుదల ఇన మాయా బజార్ సినిమా లోని కాగా నేటికీ ఆ పాటలు వినిపిస్తూ నే వుంటాయి ప్రత్యేకించి ఆ చిత్రం లో నటించిన మహా నటి సావిత్రి ఆహా నా పెళ్ళంట నీకు నాకు జోడు అంట అనే పాటలో చేసిన హావ భావవిన్యాసం అపురూపం. సావిత్రి 90 వ జయంతి సందర్భంగా సుస్వర సుగుణ కళా భారతి సంస్థ రవి మన్య ఆర్ట్స్ నిర్వహణ లో ఆదివారం గాన సభ లోని కళా లలిత కళావేదిక పై సావిత్రి నటించిన మాయా బజార్ సినిమా లోని పాటలు గాయనీ గాయకులు మధురంగా ఆలపించారు. రవి మన్య పద్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామ రాజు, సుప్రీంకోర్టు న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి , కళాభిమానీ వెంకట రావు అతిథిగా పాల్గొనగా రవి మన్య తాను చిత్రించిన వారి వారి ముఖ చిత్రాలు వ్యాఖ్యనకళాకారిణి సుధామయి,గాయని రామా లక్ష్మి, అఖిలలకు బహుకరించారు.

## అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పది : లక్ష్మణ్‌రావు గుప్తా

**అఫ్జల్‌గంజ్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం ముందు కాశీ విశ్వనాథ్ మందిరం వద్ద లయన్స్ భోజనాలయా చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జగద్గిరిగుట్టలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

**జగద్గిరిగుట్ట, డిసెంబరు 8, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రజాపాలన సంబరాలలో భాగంగా 126 డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలోని శివ నగర్ లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం కాలనీ వాసుల సిసి రోడ్స్ అభివృద్ధి కొరకు తెలుపగ అక్కడి రోడ్లను పరిశీలించి సానుకూలంగా స్పందించి త్వరలోనే వారి సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సాంబశివరావు, సంతోష్, రామకృష్ణ, జావిద్, రవీందర్, శ్రీనివాస్ చారి, నాగరాజు, మాధవరావు, రాఘవేంద్ర, కుర్మయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు రషీద్ బేగ్, నరేందర్ రెడ్డి బుచ్చిరెడ్డి, రత్నేశ్వరరావు, రత్నకుమారి, అనిత, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వేణు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు మహిళలకు స్వయం ఉపాధి పథకం కింద రూ.7,500 కోట్ల వడ్డీలేని రుణాలు ఇప్పించిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం షెనాయ్ నర్సింగ్‌హోం మున్సిపల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యాపార రంగాలలో కోటీశ్వరులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన వైష్ణవి, ముప్పిడి మధుకర్, జె.భాస్కర్, జగ్గం మహేశ్,శ్రీనాథ్, బాబు, శివకుమార్, కుజ నాగేందర్ యాదవ్, సుబ్రమణ్య స్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ పి.నరిసింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి పారిశుద్ధ్య మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు.

**రసూల్‌పురాలో...**

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం 2వ వార్డు రసూల్‌పురాలోకాంగ్రెస్ నేత శ్యామ్‌సన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాడతాం : ఐఎన్‌టియుసి



ర్యాలీగా వెళ్తున్న ఎం.ఎస్.ఎం.యూ నాయకులు

**బేగంబజార్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ప్రత్యేక సమావేశాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో ఏర్పాటు చేయాలని మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అదిల్ షరీఫ్ కోరారు. రాష్ట్ర స్థాయి సమావేశానికి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి రెండు వందల గజాల స్థలం, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, క్లాస్ 4 స్థాయి నుండి సూపరిండెంటెంట్ వరకు ఆగి ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించడం వంటి సమస్యలపై పోరాడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. హైదరాబాద్ మహానగర సంస్థలో వెంటనే ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంతోపాటు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవిఎస్‌గాంధీ, ఎం.మోజస్, కోదారిరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం

**జగద్గిరిగుట్ట, డిసెంబరు 8, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట పరధిలోని శివనగర్‌లో కాంగ్రెస్ నాయకులు రాంబాబు నిర్వహించిన అయ్యప్పస్వామి మహపడిపూజ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ:సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, బుచ్చి రెడ్డి, రషీద్ బేగ్, యువజన అధ్యక్షులు వెనుగౌడ్, అరుణ్, మహిళ కాంగ్రెస్ నాయకురాలు సునీత, మీనా, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు...కార్పొరేటర్

**నాచారం, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని దుర్గానగర్ ప్రభుత్వ స్కూల్లో యాదవ్ సేవా సంఘం, పిట్టిపన్నాలాల్ ట్రస్ట్, అగర్‌వాల్ సేవా దల్ సంయుక్తంగా మెగా మెడికల్ హెల్త్ క్యాంప్‌ను కిమ్స్, సన్‌షైన్ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ పాల్గొని శిబిరాన్ని ప్రారంబించారు. 400 మందికి రోగులకు వివిధ రకాల వైద్యసేవలతోపాటు అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కంటి, దంతాలు, ఆర్థో, ఈసీజీ, టూడిఎకో, కార్డియాలజీ, ఫిజియో వంటి సేవలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు శరత్ యాదవ్, మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ అసోసియేషన్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

**ముషీరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ విధానానికి ప్రభుత్వ అనుమతులకు లోబడి ఇసుక రవాణా చేస్తున్న లారీ యజమానుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మైన్స్ అండ్ సాండ్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ క్వారీలలో ఎలక్ట్రానిక్ కాటాలు, సీసీ కెమెరాలు లేకపోవటం వల్ల అధిక లోడు నింపుతున్నారని, అక్కడ జరుగుతున్న బకెట్ దందా వల్ల ఆర్టీఏ దాడులు, పోలీస్ దాడులలో లారీ యజమానులు చేయని తప్పుకు శిక్ష అనుభవించవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీలలో ఎలక్ట్రానిక్ కాటాలు, సీసీ కెమెరాలు, పార్కింగ్ యార్డులు ఏర్పాటుచేయాలని, ఓవర్‌లోడ్ విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని లోడింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, అక్రమ కేసుల నుండి లారీ యజమానులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రహదారులపై పోలీస్ పెట్రోలింగ్ పెట్టి లారీలకు భద్రత కల్పించాలని, రహదారులపై లారీల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటుచేయాలని, చెక్‌పోస్టులు పెట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రాజధానికి దశాబ్దాలుగా సేవలందిస్తున్న లారీ యజమానుల సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని లేనిపక్షం అన్ని జిల్లాల నాయకులతో చర్చించి భవిష్యత్ పోరాటంపై ప్రణాళిక రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ వెన్నపూజ పరశురాజ్, లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సలీం, రాములు గౌడ్, జగదీష్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, విద్యార్థి ఉద్యమనాయకులు ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

I, hereby issue this Public Notice on behalf of my client **Dr. S. Naresh, S/o Late Somaiah**, that my client has been assured by way of written Agreement by the Management and Partners of Sreshta Orange Hospital and Orange Cosmetology Hospital that he is not liable for any payables to anybody claiming from both the organization/s, including the personal Chit Funds taken and the funds used in the organization and till day payments made from the Orange Bank accounts. Further, my client has been assured for the repayment of the return of the investments made by him in the hospital and hence anybody entering into the firm or anybody purchasing the said hospital business or obtaining any percentage of share in the same, shall be liable for the return of investments as promised by way of written agreement.

**Sd/- J. PRASAD GOUD**
**Advocate**
**Office:** #3-12-74/16, G.S.I. Post, Mansoorabad, L.B.Nagar, Hyderabad-500 068.
**Cell: 9052249049.**

**IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE Cum II ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: AT: MALKAJGIRI**

**O.S.No.455 OF 2022**

**BETWEEN:**
**UNION BANK OF INDIA, TURKAPALLY BRANCH**
**...PLAINTIFF**
**AND**
**T.J.PRITHVI RAJ**
**...DEFENDANTS**

Shri T.J.PRITHVI RAJ, S/o. Sri T.R.Janardhan, H.No. 1-5-562/6/1/1, Jonna Banda, Surya Nagar, Old Alwal, SECUNDERABAD-500 010.

The Plaintiff above named filed the above suit for recovery of money against the Defendants and the matter now posted to 16-12-2024 for your appearance. If you fail to appear before the Honorable Court on **16-12-2024 at 10.30 A.M.** either in person or through Counsel the matter will be decided in your absence.

**//BY ORDER OF THE COURT//**
**JAYANTH MAKTHAL**
**V.PRAMOD KUMAR**
**and N.SUJATHA, ADVOCATES**
**H.No.1-18-8, Sri Ramnagar Colony, Trimulghery Post, Alwal SECUNDERABAD-500 015.**

